క్లుప్తంగా

ఘనంగా కోదండ రాముని గ్రామోత్సవం



జగపతినగరంలో కోదండ రాముడిని దర్శించుకుంటున్న భక్తులు

కిర్లంపూడి: మండల పరిధిలోని గ్రామాలు హరి నామ స్మరణతో మార్మోగుతున్నాయి. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామివారికి మేలు కొలుపు సేవ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమరాయణంపేటలో వేంచేసిన కోదండ రాముడి గ్రామోత్సవం ఆదివారం కన్నులపండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గోదాదేవి సారె సమర్పణ



జగ్గంపేటలో గోదాదేవికి సమర్పించిన సారె

జగ్గంపేట: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి ఆదివారం 108 మంది మహిళలు సారె సమర్పించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం , వాసవీ క్లబ్, మహిళా సంఘం ఆధ్వర్యంలో 108 మంది మహిళలు పలు రకాల పండ్లు, వంటకాలతో సారెను గ్రామంలో ఊరేగించారు. రాజగోపాలస్వామి ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి వాసు ఆచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవికి బోగిపళ్లు పోశారు. ఈ సందర్భంగా గోదాదేవి అలంకరణలో యువతులు సందడి చేశారు.

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి



కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద వ్యాపారులకు సూచనలు ఇస్తున్న ఎస్‌డీపీఓ శ్రీహరిరాజు

కిర్లంపూడి: సంక్రాంతి పండగకు స్వగ్రామానికి తిరిగివచ్చే ప్రయాణికులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని పెద్దాపురం ఎస్‌డీపీఓ శ్రీహరిరాజు సూచించారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, స్థానిక ఎస్సై జి.సతీష్‌తో కలిసి కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద ఆదివారం భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగలకు స్వగ్రామానికి వచ్చే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. టోల్‌ప్లాజాకు ఇరువైపులా 500 మీటర్ల మేర నిషేధిత ప్రాంతమని, రోడ్డు పక్కన వ్యాపారాలు నిర్వహించేకునే వారు రోడ్డుకు అడ్డంగా పరుగులు పెడుతూ ప్రమాదాలకు గురికావద్దని హెచ్చరించారు.

కోడి పందేల బరులు ధ్వంసం



గోవిందపురం వద్ద కోడి పందేల కోసం వేసిన టెంట్లు తొలగిస్తున్న పోలీసులు

జగ్గంపేట: స్థానిక పోలీసు సర్కిల్ పరిధిలోని జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో కోడి పందేలు జరగకుండా పోలీసులు గస్తీ ముమ్మరం చేశారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు కోడి పందేలు జరిగే గ్రామాల్లో పర్యటించారు. కోడిపందేలు జరిగే బరులను ధ్వంసం చేశారు. కోడి పందేల కోసం వేసిన టెంట్లను పీకేశారు. కోడి కత్తులు కట్టేవారిని, తయారీ దారులను గుర్తించి వారిపై బైండవర్ కేసులు పెట్టారు. ఇప్పటి వరకు జగ్గంపేటలో 77 మంది, కిర్లంపూడిలో 110 మంది, గండేపల్లి 100 మందిపై బైండేవర్ కేసులు పెట్టినట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు.

రౌతులపూడి: సంక్రాంతి నేపథ్యంలో కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూదాలు, రికార్డింగ్ డ్యాన్స్ వంటి అసాంఘిక కార్యక్రమాలకు అనుమతి లేదని రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో కోడిపందేల కోసం ఏర్పాటు చేసిన బరులు, గుండాట, పేకాట శిబిరాలను ఆదివారం రెవెన్యూ అధికారులతో కలసి ధ్వంసం చేశారు. గ్రామాల్లో ఎవరైనా కోడిపందేలు, పేకాట, గుండాట వంట జూదాలతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్ట రీత్యా శిక్షిస్తామని హెచ్చరించారు. స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.



గోకవరం దేవీచౌక్ ఆలయం వద్ద భోగి పండగకు ఏర్పాట్లు



ప్రయాణికులతో రద్దీగా ఉన్న గోకవరం ఆర్టీసీ బస్టాండ్



ఏలేశ్వరంలో భోగిమంటకు సిద్ధం చేసిన కలప

సంక్రాంతి వచ్చిందే తుమ్మెద !

- భోగభాగ్యాల భోగికి జోరుగా ఏర్పాట్లు
- ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్లు రద్దీ
- సంప్రదాయం మాటున కోడిపందేలకు బరులు సిద్ధం

గోకవరం/ఏలేశ్వరం/తుని/తునిరూరల్/గండేపల్లి/ప్రత్తిపాడు: సంక్రాంతి పండగ వచ్చిందంటే ఊరూ, వాడా సందడి నెలకొంటుంది. నెలరోజుల ముందు నుంచే ఇళ్ల ముంగిట్లో నెలగంట ముగ్గులు, గ్రామాల్లో హరిదాసుల సంచారం వంటివి పండగకు అదనపు ఆకర్షణ తెచ్చిపెడుతుంటాయి. నాలుగు రోజుల పాటు జరిగే సంక్రాంతి పండగ అంటే తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకం. కాగా ఈ ఏడాది ప్రజల వద్ద కొనుగోలు శక్తి తగ్గడంతో పేదలు, మధ్య తగతి కుటుంబాల్లో సందడి కరువైంది.

దుంగలు రెడీ

మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో పల్లెలు సంక్రాంతి పండగకు రెడీ అయ్యాయి. ప్రతి ఇల్లు రంగవల్లులతో కళకళలాడుతుంది. సంక్రాంతి పండగ నాలుగు రోజుల్లో ముందు వచ్చే భోగి పండగ అంటే చిన్నా, పెద్దా అందరూ సందడి చేస్తుంటారు. భోగి మంటల్లో భోగి పిడకలు వేసేందుకు చిన్నారులు పోటీ పడితే భోగి మంటలను పెద్దగా వేసేందుకు పెద్దలు పోటీ పడుతుంటారు. ఇందు కోసం పెద్దపెద్ద దుంగలను సేకరించి భోగి మంటలు వేసేందుకు ప్రతి గ్రామంలో ఏర్పాట్లు చేస్తున్నారు. గోకవరంలోని దేవీచౌక్ ఆలయం వద్ద భోగి మంటను వేసేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా రెండు రోజులు ముందే భారీ చెట్టు మొదలు తీసుకువచ్చి ఆలయం ముందు ఉంచారు. భోగి రోజు తెల్లవారు జామున ఆలయం ముందు భోగి మంట వేయనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు తెలిపారు. గత మూడు రోజులుగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలతో పాటు కొన్ని ప్రైవేటు సంస్థల్లో సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

రద్దీగా బస్సులు

సంక్రాంతి పండగను పురస్కరించుకుని గోకవరం , జగ్గంపేటలోని ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. పుట్టింటికి, అత్తారింటికి వచ్చేవారితో బస్సులన్నీ రద్దీగా మారాయి. అలాగే ప్రైవేటు వాహనాలు సైతం ప్రయాణికులతో కిక్కిరిసాయి. అలాగే నూతన వస్త్రాలను కొనుగోలు చేసేందుకు మండల ప్రజలతో పాటు ఏజెన్సీ గ్రామాలకు చెందిన వారు మండల కేంద్రమైన గోకవరంలో వస్త్రాల దుకాణాలకు పోటెత్తారు. దీంతో గోకవరంలో పలు సెంటర్లు రద్దీగా మారాయి.

కోడిపందేలకు రెడీ

సంక్రాంతి నేపథ్యంలో సంప్రదాయం మాటున కోడిపందేలకు బరులు సిద్ధమయ్యాయి. జగ్గంపేట నియోజకవర్గంలో జగ్గంపేట, కిర్లంపూడి, గోకవరం , గండేపల్లి మండలాల్లో పందేలు నిర్వహించేందుకు స్థానిక నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కోడిపందేలు, జూదాలను అడ్డుకుంటామని పోలీసులు నెలరోజుల నుంచి ప్రకటనలు చేస్తున్నా సాంప్రదాయం మాటున భోగి మొదలు ముక్కనుమ వరకు వాటిని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

గండేపల్లి మండలంలో..

సంక్రాంతి రాక కోసం ఎదురుచూసిన పందెరాయుళ్లకు ఆ సమయం కాస్త రావడంతో కోడి పుంజులను బరిలోకి దింపేందుకు సిద్ధమయ్యారు. మండల పరిధిలోని గ్రామాల్లో కోడి పందేల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బరులు సిద్ధం చేశారు. కోడి పందేల నిర్వహణకు వేలం పాటలు జోరుగా సాగినట్టు ప్రచారం జరుగుతోంది. కాగా మరోవైపు కోడి పందేలకు అనుమతి లేదని పోలీసులు చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. జూదాలు వద్దు సంప్రదాయ క్రీడలే ముద్దు అనే నినాదంతో పోలీసులు ఇప్పటికే గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. దీంతో పాటు కోడి పందేల నిర్వాహకులు, కోడి కత్తులు కట్టే సుమారు 150 మందిని గుర్తించిన పోలీసులు వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

కొత్త అల్లుళ్ల రాక

కొత్త అల్లుళ్లు, కోడళ్లు, బంధువుల రాకతో ఇంటింటా ఆనందం నెలకొంది. ఎక్కడచూసినా జన సంచారంతో గ్రామాలు హడావుడిగా మారాయి.



తుని మార్కెట్ మెయిన్ రోడ్డులో రద్దీ

భోగికి పల్లెలు, పట్టణాలు ముస్తాబు

భోగభాగ్యాలు అందించే భోగి పండగను సోమవారం ఘనంగా జరుపుకొనేందుకు ప్రత్తిపాడు నియోజకవర్గవ్యాప్తంగా పల్లెలు, పట్టణాలు ముస్తాబయ్యాయి. ఏటా మాదిరి గానే భోగిమంటలకు యువకులు కలప వేటలో నిమగ్నయయ్యారు. గ్రామ పొలిమేరల్లోని పొలాల్లో పెద్ద పెద్ద చెట్ల మానులు తెచ్చి పోగు చేశారు. పిల్లలు తెలవారుజామునే తలస్నానం చేసి నూతన వస్త్రాలు ధరించి తాము ఆవుపేడతో చేసిన భోగి పిడకలను మంటల్లో వేసేందుకు సిద్ధమయ్యారు. ఏలేశ్వరం పట్టణంలోని పెద్దవీధి, పల్లపువీధి, తోటవీధి, దిబ్బలపాలెం, తదితర ప్రాంతాల్లో భోగి మంటలకు ఏర్పాట్లు చేశారు. ఏలేశ్వరం మండల పరిధిలోని లింగంపర్తి, యర్రవరం, పెద్దనాపల్లి, సిరిపురం గ్రామాల్లోని ముఖ్య కూడళ్లో భోగిమంటలు వేయనున్నారు.

తుని మార్కెట్‌లో రద్దీ



తుని రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఆదివారం తుని పట్టణం రద్దీగా మారింది. వంద గ్రామాలకు తుని ప్రధాన కేంద్రం కావడంతో దుస్తులు, కిరాణా, ఫ్యాన్సీ ఇతర వస్తువుల కోసం వచ్చిన వారితో మెయిన్ రోడ్డులో రద్దీ నెలకొంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ కోసం చర్యలు తీసుకున్నా ప్రజలు ఇబ్బంది పడ్డారు. అప్పోసాప్పో చేసైనా పండగ జరుపుకోవాలనే ఉద్దేశంతో పలువురు తునికి తరలివచ్చారు. దీనికి అనుగుణంగా వందల సంఖ్యలో దుకాణాలను ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో అన్ని రకాల వ్యాపారాలు కలిపి రూ.50 కోట్ల మేర అమ్మకాలు జరిగినట్టు అంచనా. ఇక సోమవారం భోగి పండగ కావడంతో ప్రధాన ప్రాంతాల్లో భోగి మంటలు వేసేందుకు కలపను సిద్ధం చేశారు. రాజకీయ పార్టీల నాయకులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపేందుకు ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పోలీసులు మాత్రం ప్రజలు ఇళ్ల వద్దనే సంబరాలు జరుపుకోవాలని, పేకాట, గుండాట, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆటోల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు.

45 పంచాయతీల్లో కోడిపందేలకు ఏర్పాట్లు

పోలీసులు కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలు చేస్తున్నా తుని నియోజకవర్గంలో పందెం రాయుళ్లు బరులను సిద్ధం చేశారు. అధికార పార్టీ నాయకుల పర్యవేక్షణలో పందేలకు సమాయత్తం అయ్యారు. తుని నియోజకవర్గం పరిధిలోని 45 పంచాయతీల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. పండుగ మూడు రోజుల పాటు అనధికారికంగా అనుమతులు ఇచ్చారని ప్రచారం జరుగుతోంది.

బస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలపై బంధువుల ఇళ్లకు బయలుదేరిన ప్రయాణికులతో బస్‌షెల్టర్లు, రహదారులు రద్దీగా దర్శనమిస్తున్నాయి. కాగా సంక్రాంతికి ఊళ్లకు వెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీస్ సిబ్బంది ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత బిళ్లనందూరు



విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న సీఐ చెన్నకేశవరావు తదితరులు

కోటనందూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో సంప్రదాయ క్రీడల్లో భాగంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నీ విజేతగా బిళ్లనందూరు టీమ్ నిలిచింది. విజేత జట్టుకు తుని రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గాడి రాజబాబు రూ.10 వేల నగదు బహుమతి, జ్ఞాపిక అందజేశారు. రన్నర్‌గా నిలిచిన పాతకొట్టాం టీంకు రూ.5 వేల నగదు, షీల్డ్ ప్రదానం చేశారు. రెండు రోజుల పాటు సాగిన ఈ టోర్నమెంట్‌లో మండలంలోని 14 జట్లు పాల్గొని ప్రతిభ కనబరిచాయని ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మహిళలకు కుట్టు మెషీన్లు అందిస్తున్న రోటరీ ప్రతినిధులు

తుని: రోటరీ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని రోటరీ 3020 పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు అన్నారు. స్థానిక రోటరీ హాల్లో 13 మంది మహిళలకు రూ.30 వేల విలువ చేసే హైస్పీడ్ కుట్టు మెషీన్లను ఆదివారం ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.నిహారికతో కలిసి ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు మంగరాజు, కార్యదర్శి వీర్రాజు, ట్రెజరర్ కిషోర్‌రెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ ఈశ్వర్‌గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో సంక్రాంతి సంబరాలు



సంప్రదాయ దుస్తుల్లో ప్రత్తిపాడు సీహెచ్‌సీ సిబ్బంది సంక్రాంతి సంబరాలు

ప్రత్తిపాడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో ఆదివారం సంక్రాంతి సంబరాలు వేడుకగా జరిగాయి. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌమ్య ఆధ్వర్యంలో భోగి మంట వెలిగించారు. భోగి మంట చుట్టూ చేరి, పాటలు పాడారు. గోమాతలకు పూజలు చేశారు. సీహెచ్‌సీ ప్రాంగణమంతా రంగురంగుల రంగవల్లులతో తీర్చిదిద్దారు. సీహెచ్‌సీ వైద్యులతో పాటు వైద్య సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు.

రావికంపాడులో అలరించిన రంగవల్లుల పోటీలు

తొండంగి: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని రావికంపాడులో ఆదివారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. గ్రామ యువత, ఓ ట్యూషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. బాలలు పతంగులు ఎగురవేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

పేకాడుతున్న 10 మంది అరెస్టు

తొండంగి: మండలంలోని బెండపూడి శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న 10 మందిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై జగన్మోహన్‌రావు తెలిపారు. వారి నుంచి రూ1.12 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఉత్తరకంచిలో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదివారం శంకుస్థాపన చేశారు. పెద్దిపాలెం - ఇ.గోకవరం, వేములపాలెం-రౌతుపాలెం, పెద్దిపాలెం నుంచి ఉత్తరకంచి, లంపకలోవ నుంచి టి.రాయవరం రహదారుల నిర్మాణ పనులను ఇ.గోకవరం, ఉత్తరకంచి గ్రామాల్లో ఎమ్మెల్యే సత్యప్రభ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా అస్తవ్యస్తంగా ఉన్న రహదారుల నిర్మాణ పనులకు కూటమి ప్రభుత్వంలో మోక్షం లభించిందన్నారు. మండలంలోని నాలుగు రహదారుల నిర్మాణానికి రూ.4 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.

శిలాఫలకాల్లో కనిపించని మోదీ బొమ్మ

మండలంలోని ఉత్తరకంచి, వేములపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిలాఫలకాల్లో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను మాత్రమే ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ బొమ్మ లేకపోవడంతో కూటమిలో భాగమైన బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నేతలు గున్నాబత్తుల రాజుబాబు, మండల మాజీ అధ్యక్షుడు కందా వీరాస్వామి, చింతాకుల రామకృష్ణ, యింటి బాబూరావు, తేజా మూర్తు ఉషారాణి అభ్యంతరం తెలిపారు. దీనిపై ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రోటోకాల్ మేరకు తాము శిలాఫలకాలను ఏర్పాటు చేశామన్నారు. స్థానిక నేతలు తెలిపిన అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రానున్న రోజుల్లో ఈ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పీఆర్ జేఈ సత్యప్రసాద్, కాంట్రాక్టర్ పడాల గంగాధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, గ్రామ సర్పంచ్‌లు వనపర్తి రామలక్ష్మి, మంతిన వెంకటరమణ, అమరాధి వెంకట్రావు, సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ల అప్పారావు, రెడ్డి అమర్‌నాథ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



24 ఏళ్ల తరువాత కలసిన పూర్వ విద్యార్థులు

గండేపల్లి: జగ్గంపేట హైస్కూల్‌కు చెందిన 2000-01 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 24 ఏళ్ల తరువాత మండలంలోని జెడ్.రాగంపేట పరిణయ ఫంక్షన్ హాలులో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు.

మహిళ అదృశ్యంపై కేసు



పల్లి రాజేశ్వరి (ఫైల్)

కిర్లంపూడి: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై జి.సతీష్ ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..అల్లూరి సీతా రామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన అప్పలనాయుడు భార్య పల్లి రాజేశ్వరి తన భర్త మరణాంతరం సుమారు 8 సంవత్సరాల నుంచి కిర్లంపూడిలో అద్దెకు ఇల్లు తీసుకుని నివాసం ఉంటోంది. ఈ నెల 2న ఫంక్షన్‌కు అని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో ఆమె సోదరి రోకల పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. రాజేశ్వరి ఆచూకీ తెలిసిన వారు 94407 96529, 94409 04834 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బాధితుడికి ఆర్థిక సాయం

తొండంగి: మండలంలోని వాకదారిపేటకు చెందిన బాధితుడు పేకేటి అప్పారావు కుటుంబానికి ఆదివారం దాతలు ఆర్థిక సహాయం అందించారు. కొద్ది రోజుల క్రితం అప్పారావు ఒంటిమామిడిలో ఆటో ప్రమాదానికి గురై వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాకదారిపేట గ్రామ యువత రూ.12 వేలు, ఎస్సై జగన్మోహన్‌రావు రూ.3 వేలు, స్ఫూర్తి ఫౌండేషన్ సహాయనిధి నుంచి రూ.20 వేలు వెరసి మొత్తం రూ.35 వేలను దాతలు బాధితుడు అప్పారావుకు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎన్.శ్రీనివాసరావు, పేకేటి రాజేష్, పేకేటి దారకొండ, వాకదారిపేట యువత పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద

- ఘనంగా జయంతి వేడుకలు
- ఆయన సేవలను కొనియాడిన నేతలు

ప్రత్తిపాడు: ప్రపంచానికి భారత దేశ విశిష్టతను, సంప్రదాయాన్ని, సంస్కృతిని చాటి చెప్పిన మహావ్యక్తి స్వామి వివేకానందుడు అని లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్, మినర్వా విద్యాసంస్థల ఫౌండర్ డీవీఎస్ రమేష్‌రాజు అన్నారు. ప్రత్తిపాడు నరేంద్రగిరిపై స్వామి వివేకానంద పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. డీవీఎస్ రమేష్‌రాజు వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివేకానందుని జీవితచరిత్రను వివరించారు. విశ్రాంత ఎంఈఓ ముక్కు సుబ్రహ్మణ్యం, భారతీయ కిసాన్ సంఘ (బీకేఎస్) జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా, బీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ, బర్రే కోటేశ్వరరావు, శింగిలిదేవి సత్తిరాజు, ఏడిద రెడ్డినాయుడు తదితరులు పాల్గొన్నారు.



పెద్దనాపల్లిలో వివేకానందుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: మండలంలోని పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానందుని జయంతి వేడుకలు నిర్వహించారు. వివేకానందుని విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ యువత వివేకాందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యువత సన్మార్గంలో నడవాలని వివేకానందుడు తన బోధనల ద్వారా ప్రచారం చేశాడన్నారు. ఏలేశ్వరంలో నిర్వహించిన వివేకానందుని జయంతి వేడుకల్లో ఏడీపీ ప్రసాద్, కటకం కిరిటీ, తూమురౌతు గురయ్య, ఉడతల రమణారావు తదితరులు పాల్గొన్నారు. సిరిపురంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో వివేకానందుని జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శంఖవరంలో వివేకానంద చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న విశ్వ హిందూ పరిషత్ సభ్యులు

శంఖవరం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం శంఖవరంలో స్వామివివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేకల కృష్ణ, కుర్రే వెంకటేశ్వరరావు, జట్లా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం జాతీయ యువజనోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక వివేకానంద విద్యాలయలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు ఒమ్మి రఘురాం వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిగ్రీ కాలేజీ అధ్యాపక సిబ్బంది, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

రౌతులపూడి: మండలంలోని డీజే పురంలో సారా బట్టీలపై ఆదివారం తుని ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధంసం చేసినట్టు తుని ఎక్సైజ్ ఎస్ఐ శాస్త్రి తెలిపారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో తుని ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.